# నీళ్లన్నీ తమిళనాడుకే!



నిండు కుండలా మాడి చెరువు

- సోమల ప్రాంతంలో మొరవెత్తిన రాయలచెరువు
- మొరవపోతున్న మాడి పెద్ద చెరువు
- ఈ నీరంతా కౌండిన్య ద్వారా తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టుకు
- ఎరిగినేరు నది నీరూ తమిళనాడుకే
- తమిళనాడుకు ప్రయోజనం కలుగుతున్న వైనం

పలమనేరు: జిల్లాలోని పుంగనూరు ప్రాంతంలోని నదులు కొన్ని తూర్పువైపునకు, కొన్ని దక్షిణానికి ప్రవహిస్తుంటాయి. పలమనేరు, కుప్పం నియోజక వర్గాలకు చెందిన నదులు దక్షిణానికి ప్రవహిస్తున్నాయి. ఇవన్నీ పలమనేరు సమీపంలోని కౌండిన్య నది గుండా ప్రవహించి మనకు ఎలాంటి ఉపయోగం లేకుండా తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం తాలుకా సమీపంలోని మోర్ధన ప్రాజెక్టుకు చేరి తమిళవాసులకు మేలు చేస్తున్నాయి. ఏటా వానలు కురిసినప్పుడల్లా ఇక్కడి నదుల నుంచి వెళ్లే వరద నీరు ఇక్కడి వారికి ప్రయోజనం లేకుండా తమిళులపాలవుతోంది.

**ఏటా 200 ఎంసీఎఫ్టీ నీరు తమిళనాడు పాలు..**

జిల్లాలోని పడమటి ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. మెట్ట ప్రాంతమైన పలమనేరు నియోజకవర్గంలో తాగు, సాగు నీటికి కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో ఎక్కువ మందికి వ్యవసాయమే జీవనాధారం. ఈ నియోజకవర్గంలో కౌండిన్య, ఎరిగినేరి, కైగల్, దుర్గమ్మ నదులు ముఖ్యమైనవి. వర్షాకాలంలో ఈ నదుల ప్రవహించినప్పుడు 200 ఎంసీఎఫ్టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్లు)ల నీరు వృథాగా తమిళనాడు రాష్ట్రంలోని మోర్ధన ప్రాజెక్టులోకి చేరుతోంది.

**వైఎస్ చొరవతో కౌండిన్య కష్టం తీరింది**

రామసముద్రం మండలంలో పుట్టే కౌండిన్య నది పుంగనూరు, పెద్దపంజాణి, గంగవరం, పలమనేరుల మీదుగా కౌండిన్య అడవిలో తమిళనాడు రాష్ట్రంలోకి పయనిస్తోంది. వైఎస్ హయాంలో ఈ నదిపై కాలువపల్లెవద్ద కౌండిన్య నదిపై రూ.55 కోట్లతో వైఎస్సార్ జలాశయం ప్రాజెక్టును తాగు నీటి అవసరాల కోసం నిర్మించారు. అయితే ఈ ప్రాజెక్టుకు తగినన్ని నీళ్లు లేకపోవడంతో దీనికి అనుసంధానంగా చేపట్టాల్సిన గంగన శిరస్సు నదిపై చేపట్టాల్సిన పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పనులను గతంలో కిరణ్ సర్కార్‌గానీ, ఆపై చంద్రబాబు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఆపై అధికారంలోకి వచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటవీశాఖ అభ్యంతరాలను పరిష్కరించింది. దీంతో ఇప్పటి కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు అంచనాలు పెంచి పనులు చేస్తామని చెబుతున్నప్పటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ఇక ప్రాజెక్టుల కథ కంచికేనని అర్థమవుతోంది.



మొరవపోతున్న రాయలచెరువు

**గంగన శిరస్సుకు తొలగని విఘ్నం...**

బైరెడ్డిపల్లె మండలంలోని బాపలనత్తం అడవుల్లో పుట్టిన గంగనశిరస్సు పలమనేరు మండలంలోని కౌండిన్య అడవిలో పయనిస్తూ తమిళనాడులోని మోర్ధనకు చేరుతోంది. ప్రస్తుతం ఈనది ప్రవహిస్తోంది. ఈ నదిలోని 30 ఎంసీఎఫ్టీల నీరు మనకు ఉపయోగం లేకుండా తమిళనాడు వాసులకు వరంలా మారింది. ఈనదిపై గంగనశిరస్సు ప్రాజెక్టు పనులు అర్ధంతరంగా ఆగాయి. ఈ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అంచనాలను పెంచామని చెబుతున్నా పనులు ఇప్పట్లో మొదలయ్యే అవకాశం కనిపించడం లేదు.

**కైగల్ ఎత్తిపోతలపై ఆశలెన్నో..**

బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ నది కర్ణాటకలోని ముళ్‌బాగల్ సమీపంలోగల కురుడుమళై ప్రాంతంలో పుట్టి బైరెడ్డిపల్లె మండలం మీదుగా తమిళనాడు సరిహద్దు నుంచి కౌండిన్య నదిలో కలుస్తోంది. కర్ణాటకలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఈ నది ప్రవహిస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం దీనిపై అదోఇదో అంటూ కాలం వెల్లదీసింది. ఆపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీనిపై స్పందించడంతో ఇరిగేషన్ శాఖలో కదలికలు మొదలయ్యాయి. ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం భూముల బదలాయింపులు సైతం జరిగాయి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక పనులు విషయం ఎటూలేకుండా పోయింది. ఈ నది నుంచి నీటిని బెరెడ్డిపల్లి చెరువులకు అనుసంధానం చేస్తే ఆ మండలం మొత్తం సస్యశ్యామలమవుతుంది.

**వృథాగా పోతుంటే బాధేస్తుంది..**



ఇటీవల కురిసిన వర్షాలకే అడవిలోని ఎరిగినేరు ప్రవహిస్తోంది. ఏటా నది నీళ్లు తమిళనాడులోని మోర్ధన డ్యాంకు చేరుతున్నాయి. ఇక్కడ గంగనశిరస్సు పూర్తయి ఉంటే మా ప్రాంతానికి మేలు జరిగేది. నదిలో నీళ్లు పోతూ ఉంటే బాధగా ఉంది. కూటమి ప్రభుత్వం నైనా ప్రాజెక్టును నిర్మిస్తే ఈప్రాంత వాసుల కోరిక తీరుతుంది.

–మురుగన్, రైతు, చెత్తపెంట, పలమనేరు మండలం

**మూడు దశాబ్దాల కల ఇది..**



కౌండిన్య నది గత నాలుగేళ్లుగా ప్రవహించింది. ఈ నదిలోని నీరు మొత్తం మనకు ఉపయోగం లేకుండా పొరుగునే ఉన్న తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టుకు చేరుతోంది. కనీసం కైగల్, గంగన శిరస్సు ప్రాజెక్టులను నిర్మించి ఉంటే ఇక్కడి రైతులకు ఎంతో మేలుగా ఉండేది.

–చెంగారెడ్డి, రైతు, కూర్మాయి

## అన్నిదారులు మోర్ధనే ప్రాజెక్టుకే..

పలమనేరు ప్రాంతంలో రాకరాక కురిసే వానలకు వాగులు, వంకలు, నదుల నుంచి ప్రవహించే వర్షపు నీరు పొరుగునే ఉన్న తమిళనాడు మోర్ధన డ్యామ్‌కు చేరుతోంది. దీంతో తమిళనాడు వాసులకు మేలు చేకూరుతోంది. ఈప్రాంతంలో వరుణుడు కరుణించినా ఆ నీటికి అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. ఈసమస్యలపై గత ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో పలు ప్రాజెక్టుల విషయంలో కదలిక మొదలైంది. అయితే ఈ ప్రాజెక్టులకు అటవీశాఖ అభ్యంతరాలు అడ్డుపడడంతో ఈ పనులు ఆగాయి. కనీసం ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తుందా లేదా గాలికొదిలేస్తుందా అనే అనుమానం ఇక్కడి రైతులకు కలుగుతోంది.



తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టు

## కౌండిన్యకు చేరుతున్న వరదనీరు..

ఇలా ఉండగా ఇటీవల కురిసిన వర్షాలతో పెద్దపంజాణి మండలంలోని రాయలచెరువు మూడు రోజులుగా మొరవెత్తుతోంది. ఇప్పుడు ఆనీరు కౌండిన్యలోకి చేరుతోంది. మరో నాలుగైదు రోజుల్లో కర్ణాటక సమీపంలోని పెద్దపంజాణి మండలంలోని మాడి చెరువు సైతం మొరవెత్తనుంది. ఈ నీరు సైతం కౌండిన్యలోకి చేరుతోంది. దీంతో ఈ నీరు కాలువపల్లి సమీపంలోని వైఎస్సార్ జలాశయంలోకి చేరి ఆపై తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టుకు చేరిపోవాల్సిందే. దీంతో ఏటా వర్షాల సమయంలో ఇక్కడి వర్షపు నీరు వృథాగా తమిళనాడు పాలవుతోంది. దీనిపై అధికారంలోని కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.



వర్షాలకు ప్రవహిస్తున్న కౌండిన్య అడవిలో ఎరిగినేరు నది

## క్లుప్తంగా

### చెరువు కట్ట పరిశీలన



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని నాయనవారిపల్లె బోడినాయిని చెరువుకట్ట ఇటీవల వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. సమాచారాన్ని సర్పంచ్ అనితకుమారి ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. ఇరిగేషన్ ఈఈ వీఎన్‌సీ గిరి గురువారం చెరువుకట్టను పరిశీలించారు. చెరువు కట్ట ఎత్తు పెంచేందుకు, మరమ్మతులకు నివేదిక రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని చెప్పారు. డీఈఈ ప్రసాద్, ఏఈ భరత్, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రకాష్‌రెడ్డి, మహేశ్వరనాయుడు, నవీన్, హరి పాల్గొన్నారు.

### చలమంగళంలో ఫ్యామిలీ డాక్టర్

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.మురళి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ వాజిదా ఫర్హాను, ఏఎన్‌ఎం నాగరత్న, ఆశావర్కర్లు నాగమణి, రత్నమ్మ, తాజితా పాల్గొన్నారు.

### గురుకుల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

సదుం: పద్య పఠనంలో స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. గత మంగళవారం బీసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురుకుల విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. పోటీల్లో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చౌడేపల్లె సింగిరిగుంటకు చెందిన బాలకుమార్ కుమారుడు శివశంకర్ వరప్రసాద్ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించారని ఆయన చెప్పారు. విద్యార్థిని పాఠశాల సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు.

### నిత్యావసర సరుకులు అందడం లేదు

- కడా పీడీకి ఫిర్యాదు



పీడీకి ఫిర్యాదు చేసిన మహిళలు

కుప్పం: రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ వాసులు కడా పీడీ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం కడా కార్యాలయంలో ఆయన్ను కలసి వినతి పత్రం అందజేశారు. గత ఆరు నెలలుగా బీసీ కాలనీలో రేషన్ కార్డుదారులకు అందజేసే సరుకులు 60శాతం ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన కడా పీడీ నిత్యావసర సరుకులు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

### సమయపాలన పాటించండి



మాట్లాడుతున్న యువరాజ్

వి.కోట: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ యువరాజ్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం లేకుండా సమయపాలన పాటించాలన్నారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు క్రీడా పోటీలు

చౌడేపల్లె: స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గౌతమ్, భవిత సిబ్బంది రామ్‌మోహన్, నరేష్ పాల్గొన్నారు.

### బేబీ కిట్ల పంపిణీ



బేబీ కిట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

వి.కోట: వి.కోట గ్రేటర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాలింతలకు బేబీ కిట్లు, అల్పాహారాన్ని పంపిణీ చేసినట్లు ఆ సంస్థ మండలాధ్యక్షుడు ధీరజ్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు, రోగులకు అల్పాహారంతోపాటు బాలింతలకు బేబీ కిట్లను పంపిణీ చేశామన్నారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా 5న స్థానిక సీహెచ్‌సీలో బేబీ కిట్లు, అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు క్రిష్ణమూర్తి, కేశవులు, తుకారం, లక్ష్మణ్, మురుగేష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలో ఆధార్ సవరణ అవసరాలపై ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ బయోమెట్రిక్, ఇతర సవరణల కోసం ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుని ఈ ఏర్పాటు చేశామన్నారు. గుడుపల్లి మండలంలో ఈనెల 6,7 తేదీల్లో, కుప్పంలో ఈనెల 9,10, కుప్పం అర్బన్‌లో 11,12 తేదీల్లో, రామకుప్పంలో 16,17 తేదీల్లో, శాంతిపురం మండలంలో ఈ నెల 18,19 తేదీల్లో శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కుప్పం ప్రాంత అభివృద్ధి అథారిటీ(కడ) పరిధిలోని అందరు ఎంపీడీఓలు, తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

## సచివాలయ సిబ్బందికి సన్మానం



అధికారులను సన్మానిస్తున్న నేతలు

శాంతిపురం: చిన్నారిదొడ్డి గ్రామ సచివాలయంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ, బదిలీలు పొందిన సిబ్బందిని స్థానిక నాయకులు సన్మానించారు. గురువారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన వీఆర్వో జయరాం, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు రవితేజ, కోకిల, శ్రీనివాసులురెడ్డిని సత్కరించారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సర్పంచ్‌లు బాలసుబ్రమణ్యం, బాలకృష్ణ, నేతలు జయప్ప, నాగరాజు, చలపతి, మునెప్ప, హరినాథరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



విన్నర్స్ మర్రిమాకుల సీనియర్ జట్టు

చౌడేపల్లె: మండలంలోని మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పుంగనూరు జోనల్ గ్రిగ్ మెమోరియల్ ఫుట్‌బాల్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రీడా పోటీలను హెచ్‌ఎం నాథమునినాయుడు గురువారం ప్రారంభించారు. క్రీడాపోటీలకు నాలుగు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్ బాలుర పోటీల్లో మర్రిమాకులపల్లె విన్నర్స్, చంద్రమాకులపల్లె జట్టు రన్నర్స్‌గా గెలుపొందారు. జూనియర్ బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో మర్రిమాకులపల్లె జట్టు విన్నర్స్, చంద్రమాకులపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. పీడీలు పవన్ కుమార్, సుబ్బు, మురళీ, కిరణ్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



బైసానీ ఫంక్షన్ హాల్‌లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: మండల కేంద్రంలోని శ్రీనివాసకల్యాణ మండపంలో గురువారం రాత్రి పీఎల్ కొత్తూరుకు చెందిన సి.దేవిరెడ్డి కుమార్తె రెడ్డిపవిత్రను బయ్యపల్లెకు చెందిన పెద్ద రెడ్డెప్పరెడ్డి కుమారుడు కె.అమరనాథరెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా బైసానీ ఫంక్షన్ హాల్‌లో గోసలకురప్పల్లెకు చెందిన కదిరప్పనాయుడు కుమారుడు సుదర్శన్, సాయిశిరీష రెసెప్షన్ వేడుకలకు పెద్దిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలోని వీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగిన మాజీ ఎంపీపీ సిద్ధమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెంచురెడ్డి మనవరాలు టి.సౌమ్య, వరుడు టి.హరీష్‌రెడ్డిల వివాహ రెసెప్షన్ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా నాగిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన బాలనాగిరెడ్డిగారిపల్లె దాసరిగూడెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వెంకటరత్నం కుమారుడు మునిరత్నం వివాహ వేడులకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



వీఎంఆర్ కల్యాణ మండపంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి

## ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



శిక్షణ ఇస్తున్న మురళీకృష్ణ

కుప్పం: ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా కుప్పం మండలం పీబీ నత్తం రైతు సేవా కేంద్రంలో రైతులకు నేలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం రైతులకు నేల సంరక్షణ, ఆవశ్యకత గురించి జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ వివరించారు. వ్యవసాయాధికారి అప్పోజి, అమృతవల్లి పాల్గొన్నారు.

## మూగ జీవాల కోసం ల్యాబ్ ఏర్పాటు

పుంగనూరు: పుంగనూరు డివిజన్ ప్రాంతంలో మూగజీవాలకు ఎదురయ్యే పశు సమస్యలను పరిష్కరించేందుకు ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు వెటర్నరీ ఏడీ డాక్టర్ మనోహర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలోని ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు రోగాల బారిన పడినప్పుడు వాటి ఆరోగ్యసమస్యలను గుర్తించి, చికిత్స అందించేందుకు స్థానికంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పన్నులు కట్టాల్సిందేనబ్బా!

పలమనేరు: ఎన్నో ఏళ్లుగా బకాయిలున్న పన్నులను కట్టాల్సిందేనని మున్సిపల్ అధికారులు గట్టి చర్యలకు దిగారు. ఆమేరకు పట్టణంలోని జవిళి వీధికి చెందిన రాజావిలియమ్స్ గత 11 ఏళ్లుగా రూ.1.50లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ కట్టనందున అక్కడ దుకాణాల్లో అద్దెకున్న వారికి మున్సిపల్ సిబ్బంది గురువారం నోటీసులను జారీ చేశారు. ఇకపై పట్టణంలోని పన్ను బకాయిదారులను వదిలిపెట్టే సమస్యే లేదని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఏటా నిర్వహించే విధంగా నిర్వాహకులు కృష్ణారెడ్డి అయ్యప్ప భక్తులకు జనవరి 14వ తేదీ వరకు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అయ్యప్పమాల ధరించిన భక్తులు ఆలయంలో ప్రసాదాలను స్వీకరించవచ్చునని ఆయన తెలిపారు.

## బీమాను సద్వినియోగం చేసుకోండి



పంటలను పరిశీలిస్తున్న..

వి.కోట: రైతులు ప్రభుత్వ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్ సూచించారు. గురువారం ఆయన ఓగు వద్ద ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పండ్లు, కూరగాయాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసే టమాట పంటకు బీమా పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని గెస్తింపల్లిలో వివిధ దశల్లో ఉన్న బంగాళదుంప పంటలను పరిశీలించారు. మండల ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

శాంతిపురం: మండలంలోని ఎంకేపురం గ్రామ సచివాలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంకే పురం వచ్చిన ఆయన సచివాలయాన్ని తనిఖీ చేశారు. స్థానికులను వ్యవసాయ సలహాలు, వైద్యం అందుతున్న తీరును, ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ పథకాల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ గజ్జల మోహన్, రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడతాం



భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

పుంగనూరు: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడతామని, ఈ మేరకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు. గురువారం మండలంలోని బోడేవారిపల్లె వద్ద రియల్ ఎస్టేట్ భూములను పరిశీలించారు. రియల్ ఎస్టేట్ భూమిలో ప్రభుత్వ భూమి ఉందంటూ పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదులు పంపారు. ఈనేపథ్యంలో ఆర్డీఓ ఆ భూములను పరిశీలించడం జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ నేటి నుంచి జరిగే రెవెన్యూ సదస్సులలో ప్రజలందరూ పాల్గొని, భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బోడేవారిపల్లికి సంబంధించిన భూమి రికార్డులను పరిశీలించి వివరాలను తహసీల్దార్ రామును అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంట ఆర్‌ఐ ఫణికుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్య జాతీయ గీతాలాపనకు ప్రాధాన్యం

- కమిషనర్ మధుసూదన్‌రెడ్డి



నిత్య జాతీయ గీతాలాపనలో కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీలో ప్రతిరోజూ 8 గంటలకు నిర్వహిస్తున్న నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని, దేశభక్తిని చాటి చెప్పాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని జనగణమన కమిటీ సభ్యులతో కలసి పునరుద్ధరించారు. ఈసందర్భంగా జాతీయ పతాకానికి పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది కలసి గౌరవ వందనం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ పుంగనూరు ఖ్యాతిని దేశ నలుమూలల చాటేలా కృషిచేయడం ఎంతో అదృష్టమన్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు గీతాలాపన కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు ప్రకాష్, దీపక్, అయూబ్, బాబు, హిందూ జాగరణ సభ్యులు వెంకటేష్, మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

## నేల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా నేలల సంరక్షణపై రైతులకు అమ్మగారిపల్లె రైతు సేవా కేంద్రంలో అవగాహన కల్పించినట్లు ఏఓ హరిప్రసాద్ గురువారం తెలిపారు. నేల పరీక్షలు చేసుకొని పోషకాల ఫలితాల ఆధారంగా భూములు సరిచేసుకోవాలని సూచించారు. పంటల మార్పిడి చేసుకోవాలన్నారు. అధిక రసాయనిక ఎరువుల వాడకాన్ని నియంత్రించాలన్నారు. ఏఈఓ ఖాదర్‌వల్లి, హార్టీ, సెరీ కల్చర్ అసిస్టెంట్లు స్వర్ణలత, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.